క్లుప్తంగా

రూ.కోటితో శివాలయ నిర్మాణం



నునుసరాళ్లలో నిర్మిస్తున్న శివాలయం

తుగ్గలి: మండలంలోని నునుసరాల్లలో కోటి రూపాయలతో శివాలయాన్ని నిర్మిస్తున్నారు. పురాతన ఆలయం శిథిలావస్థకు చేరడంతో అదే స్థానంలో రూ.కోటికి పైగా ఖర్చుతో నూతన ఆలయాన్ని నిర్మిస్తున్నారు. ఆలయ నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయి. దాతలు, గ్రామస్తుల సహకారంతో సర్వాంగ సుందరంగా ఆలయ నిర్మాణం చేపడుతున్నట్లు గ్రామ సర్పంచ్ రామలక్ష్మమ్మ, గౌరవ సలహాదారు గోపాల్‌రెడ్డి తెలిపారు. నాలుగైదు నెలల్లో ప్రతిష్టా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు చెప్పారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో మెరుగైన వైద్య సేవలు



వృద్ధురాలికి వైద్యం చేస్తున్న డాక్టర్లు

నందవరం: ఫ్యామిలీ డాక్టర్ విధానంతో పేదలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యురాలు సౌజన్య తెలిపారు. శనివారం స్థానిక సచివాలయం-2లో గ్రామస్తులకు 104 ద్వారా పలువురికి వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, గర్భిణులు, బాలింతలకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి షష్టి పూజలు



హోమంలో పాల్గొన్న భక్తులు

మద్దికెర: శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామికి శనివారం షష్టి సందర్భంగా విశేషపూజలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంచామృతాభిషేకం, కుంకుమార్చన, ఆకుపూజలు, మహామంగళహారతితో పాటు హోమాలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు.

నాణ్యత పాటించాలి



రోడ్డు పనులు పరిశీలిస్తున్న డీఈ రమేష్‌రెడ్డి

మద్దికెర: రోడ్డు ఎక్కువ కాలం మన్నికగా ఉండాలంటే నిర్మాణంలో నాణ్యత పాటించాలని పంచాయతీ రాజ్ డీఈ రమేష్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రం నుంచి బొజ్జనాయునిపేట వరకు వేస్తున్న తారు రోడ్డు పనులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనల ప్రకారం రోడ్డు వేయాలని సూచించారు. పనుల దశలను బట్టి బిల్లులు మంజూరవుతాయన్నారు. సకాలంలో పనులు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్‌రెడ్డి, ఏపీసీ రాష్ట్ర డైరెక్టర్ ఆర్.వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాసులు ఉన్నారు.

ప్రింటర్ విరాళం

మద్దికెర: స్థానిక ఆదర్శ పాఠశాలకు పెరవలి గ్రామానికి చెందిన దాత పారా విశ్వనాథ్ రూ. 20 విలువ చేసే ప్రింటర్‌ను విరాళంగా అందజేసినట్లు ప్రిన్సిపాల్ సవిత శనివారం తెలిపారు. గతంలోనూ విద్యార్థుల దాహార్తి తీర్చేందుకు పాఠశాలకు బోరు, పైపులైను వేయించారన్నారు.

చిన్నారుల ఆరోగ్యంపై దృష్టిసారించండి

ఆలూరు: చిన్నారుల ఆరోగ్యంపై దృష్టిసారించాలని జిల్లా ఫ్యామిలీ ఫిజీషియన్ కన్సల్టెంట్ డాక్టర్ బాలమురళీకృష్ణ సూచించారు. దేవనకొండ మండలం కరివేముల గ్రామంలో పీహెచ్ సబ్ సెంటర్‌ను శనివారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. 0 నుంచి 5 ఏళ్లలోపు చిన్నారుల వివరాలు, వారి ఆరోగ్యం కండీషన్‌పై ఆరోగ్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. విధులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట దేవనకొండ పీహెచ్‌సీ వైద్యుడు విజయ్‌భాస్కర్, సీహెచ్‌ఓ భాగ్యమ్మ, ఎఎన్‌ఎంలు, ఆశావర్కర్లు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో మారెమ్మ దేవర

హొళగుంద: మండల పరిధిలోని నెరణికి తండాలో మారెమ్మ దేవి దేవర శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. తెల్లవారుజామున మహిళలు, చిన్నారులు బోనాలతో ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. ఆకు పూజ, మహామంగళారతి, నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల కోలాహలం

- మార్చి 13న ఎన్నికలు
- ఎన్నికల ఏర్పాట్లలో అధికారులు
- ఊపందుకున్న ప్రచారం

ఎమ్మెల్సీ ఎన్నికల కోలాహలం ప్రారంభమైంది. పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు జరగనున్న ఎన్నికల కోసం అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. ఎమ్మిగనూరు, ఆలూరు, పత్తికొండ నియోజక వర్గాల్లోని రెవెన్యూ సిబ్బంది ఎన్నికల ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. మార్చి 13న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలు సజావుగా పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. – ఎమ్మిగనూరు

ఊపందుకున్న ప్రచారం..

ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల తరపున వైఎస్సార్ సీపీ, టీడీపీలతోపాటు వివిధ ఉపాధ్యాయ సంఘాలు, ప్రధాన పార్టీల అనుబంధ సంఘాలు ప్రచారం మొదలు పెట్టాయి. అధికార పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి గెలుపు కోసం మంత్రి గుమ్మనూరు జయరాం, ఎమ్మెల్యేలు చెన్నకేశవరెడ్డి, కంగాటి శ్రీదేవిలు పార్టీ శ్రేణులు, పార్టీ అనుబంధ సంఘాల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి ఎన్నికలకు సన్నద్ధం చేస్తున్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులు రామచంద్రారెడ్డి, ఎంటేరు శ్రీనివాసరెడ్డి, కత్తి నరసింహారెడ్డి, నారాయణరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, మాధవరావుల కోసం ఉపాధ్యాయ సంఘాలు, కమ్యూనిస్టు పార్టీల నేతలు, వాటి అనుబంధ సంఘాలు ప్రచారం మొదలు పెట్టాయి. టీడీపీ పట్టభద్రుల అభ్యర్థి భూమిరెడ్డి రాంభూపాల్‌రెడ్డి విజయం కోసం ఆ పార్టీ శ్రేణులు ప్రచారం చేస్తున్నాయి.

ముమ్మర ఏర్పాట్లు..

ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్ల కోసం పత్తికొండ, ఆలూరు నియోజకవర్గాలపై ఆర్డీఓ మోహన్‌దాస్ ప్రత్యేక దృష్టి సారించారు. ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ పర్యవేక్షణలో ఎమ్మిగనూరు నియోజక వర్గంలోని నందవరం, ఎమ్మిగనూరు, గోనెగండ్ల మండలాల్లో తహసీల్దార్లు ఎన్నికల ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఎమ్మిగనూరు నియోజక వర్గంలో పట్టభద్రుల కోసం 7 బూతులను ఏర్పాటు చేశారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం మూడు బూతులు ఏర్పాటు చేశారు. ఎమ్మిగనూరు మండలంలో పట్టభద్రులు 5,433 మంది, ఉపాధ్యాయులు 601 మంది ఓటర్లుగా నమోదు చేసుకున్నారు. నందవరం మండలంలో పట్టభద్రులు 1,057 మంది, ఉపాధ్యాయులు 21 మంది కాగా గోనెగండ్లలో పట్టభద్రులు 1,510 మంది, ఉపాధ్యాయులు 45 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. పత్తికొండ నియోజక వర్గంలో పట్టభద్రులు 6,473 మంది, ఉపాధ్యాయులు 327మంది ఓటర్లుగా ఉన్నారు. ఆలూరు నియోజక వర్గంలో పట్టభద్రులు 4,791 మంది, ఉపాధ్యాయులు 129 మంది ఓటుహక్కు వినియోగించుకోనున్నారు.



ఎమ్మెల్సీ ఎన్నికల కోసం పార్టీ శ్రేణులతో ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి

ఎమ్మెల్సీ ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	పట్టభద్ర ఓటర్లు	ఉపాధ్యాయ ఓటర్లు
ఎమ్మిగనూరు	8,000	667
ఆలూరు	4,791	129
పత్తికొండ	6,473	327
మొత్తం	19,264	1,123

అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం



సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ నేతృత్వంలో ఎమ్మిగనూరు, నందవరం, గోనెగండ్ల మండలాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల కోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. పట్టభద్రులకు మొత్తం 7 పోలింగ్ బూతులు, ఉపాధ్యాయులకు మూడు బూతులను ఏర్పాటు చేశాం. ఎన్నికలు జరిగే మార్చి 13న ప్రత్యేక నిఘా, అబ్జర్వర్ల పరిశీలన ఉంటుంది. ఎమ్మెల్సీ ఎన్నికలు పూర్తయ్యే వరకూ ఎన్నికల కోడ్ అమలులో ఉంటుంది. – జయన్న, తహసీల్దార్, ఎమ్మిగనూరు

ఘనంగా ఓబులేశుడి ఉత్సవం



తొగలగల్లులో ఓబులేశు స్వామి ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

అస్పరి:మండలంలోని తొగలగల్లు గ్రామంలో శనివారం ఓబులేశు స్వామి ఉత్సవం ఘనంగా జరిగింది. ఓబులేశు స్వామి, చెంచులక్ష్మి, ఆదిలక్ష్మి అమ్మవార్ల విగ్రహాలను పల్లకీలో కొలువుంచి ఊరేగించారు. గ్రామంలో నుంచి స్వామి వారి కొండ వరకు పల్లకీని లాగారు. నందికోలు,బుక్కపిండి సేవ, నుగ్గులాట తదితర కార్యక్రమాలతో భక్తులుమొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ యువకులువసంతోత్సవాన్నిఉల్లాసంగా నిర్వహించుకున్నారు.

పోలింగ్ కేంద్రాల ఏర్పాటు

మద్దికెర: వచ్చే నెల 13న జరగనున్న పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గం, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ నాగరాజు శనివారం తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూం నెంబర్ 4 లో ఉపాధ్యాయులు, రూం నెంబర్ 7లో పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు.

గెలుపోటములు సమానంగా స్వీకరించాలి

- వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి

ఎమ్మిగనూరు రూరల్: గెలుపోటములు సమానంగా స్వీకరించాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి సూచించారు. మండల పరిధిలోని ఎర్రకోట గ్రామంలో శ్రీ మహాలింగేశ్వర స్వామి జాతరను పురస్కరించుకుని నిర్వహించిన కబడ్డీ పోటీల్లో గెలుపొందిన జట్లకు శనివారం సాయంత్రం జగన్‌మోహన్‌రెడ్డి నగదు బహుమతులు అందజేశారు. కాగా మొదటి బహుమతి గోనెగండ్ల రూ.20,016, రెండో స్థానం ఎర్రకోట వైఆర్‌కే స్టార్స్ జట్టు రూ.10,016, మూడవ బహుమతి వగరూర్ జట్టు రూ.5,016 కైవసం చేసుకున్నాయి. కార్యక్రమంలో ఎంపీపీ కేశన్న, సర్పంచ్ పెద్ద మారెప్ప, ఆర్గనైజర్లు, నాయకులు పాల్గొన్నారు.



గోనెగండ్ల జట్టుకు మొదటి బహుమతి అందజేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి

క్రమశిక్షణతోనే ఉజ్వల భవిష్యత్తు

ఎమ్మిగనూరు టౌన్: క్రమశిక్షణతో కూడిన చదువులే విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు దోహదపడతాయని ఎంఈఓ ఆంజనేయులు అన్నారు. శనివారం రాత్రి స్థానిక బాబు ఫంక్షన్ హాల్‌లో బ్లాసం కిడ్స్ పాఠశాల వార్షికోత్సవంలో ఆయన మాట్లాడుతూ పిల్లలపై చదువు విషయమై తల్లిదండ్రులు కానీ, ఉపాధ్యాయులు కానీ ఒత్తిడి చేయరాదన్నారు. ఆటపాటలతో పాఠాలు బోధించాలన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కరస్పాండెంట్లు మల్లేశ్వరి, కుమార్, వైద్యులు శిల్ప, చంద్రకాంత్‌యాదవ్, నాగరాజకుమారి, ఎస్‌వి వేణుగోపాల్ పాల్గొన్నారు.



ఆకట్టుకున్న విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమం

గంజిహళ్లి ఉరుసు ప్రారంభం

గోనెగండ్ల: మండల పరిధిలోని గంజిహళ్లి గ్రామంలో వెలసిన సద్గురు మహాత్మ గంజిహళ్లి బడేసాహెబ్ తాత ఉరుసు మహోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తెల్లవారు జామున స్వామి వారి మునిమనవళ్లు సయ్యద్ చిన్న ముద్గల్‌తో పాటు తదితరులు స్వామి వారికి గంధం తీసుకెళ్లి దర్గాలో ప్రత్యేక పూజలు చేశారు. అలాగే వైఎస్సార్‌సీపీ ఎమ్మిగనూరు నియోజకవర్గ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి, కుడా ఛైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, ఎమ్మిగనూరు మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ రఘునాథ్, నాయకుడు ప్రదీప్ రెడ్డి, మాజీ కేంద్ర మంత్రి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, బీజేపీ నాయకుడు మురహరిరెడ్డిలు వేర్వేరుగా వచ్చి దర్గాను దర్శించుకున్నారు.



స్వామికి గంధం తీసుకెళ్తున్న పీఠాధిపతులు

విగ్రహాల ప్రతిష్ఠ

వెల్దుర్తి: స్థానిక హరిజన వాడ ఎంపీపీ స్కూల్‌లో శనివారం సరస్వతీదేవి, పోతులూరి వీరబ్రహ్మం విగ్రహాలను ప్రతిష్ఠించారు. సరస్వతీ దేవి విగ్రహ దాత డాక్టర్ ఆస్పరి సర్వోత్తం దంపతులు, పోతులూరి వారి విగ్రహ దాత స్థానిక వనల బ్రహ్మం ఆధ్వర్యంలో హెచ్‌ఎం సరస్వతి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ఎంఈఓ ఇందిర హాజరయ్యారు. విగ్రహాల దాతలను ఎంఈఓ, హెచ్‌ఎం, పాఠశాల ఉపాధ్యాయులు సన్మానించారు.

ఏపీ కన్నడిగుల ప్రతిఘటన ర్యాలీకి తరలిరండి

హొళగుంద: కర్ణాటక రాష్ట్రం బళ్లారి జిల్లా కేంద్రంలో ఈ నెల 27న చేపట్టనున్న కన్నడిగుల ప్రతిఘటన ర్యాలీకి తరలి రావాలని హొళగుంద, ఆదోని, పెద్దహరివాణం, కౌతాళం తదితర ప్రాంతాల కన్నడ సంఘాల నాయకులు దొడ్డ బసప్ప, ఊకూరు కాడప్ప, పంపావతి, శివశంకర్‌గౌడ్, ఎర్రిస్వామి, పోతరాజు, కబీర్, ఏకే మారెప్ప, గురుబసవరాజు తదితరులు కోరారు. శనివారం వారు మాట్లాడుతూ ఆంధ్రలో ఉంటున్న కన్నడిగులు, కన్నడ విద్యార్థులు కర్ణాటకలో విద్యా, ఉద్యోగపరంగా తీవ్ర అన్యాయానికి గురవుతున్నారన్నారు. కర్ణాటక ప్రభుత్వం ఇక్కడి కన్నడిగులను 'గడినాడు కన్నడిగులు'గా గుర్తించి విద్యా, ఉద్యోగాల్లో ప్రాధాన్యం కల్పించాలని కోరుతూ ఏపీ కన్నడ సంఘాలు, బళ్లారి జిల్లా కర్ణాటక రక్షణ వేదిక, తుంగభద్ర రైతు సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టనున్నామన్నారు.

తాగునీటి ఎద్దడిని తీర్చండి

ఆలూరు: వేసవి కాలంలో తాగునీటి సమస్య రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని దేవనకొండ ఎంపీడీఓ గౌరీ దేవి సర్పంచ్‌లకు సూచించారు. శనివారం దేవనకొండ మండల కార్యాలయంలో పలు గ్రామాల సర్పంచులు, వాటర్‌మెన్లకు ఆమె తాగునీటి పైపులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు.

ఓపెన్ ఇంటర్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఆలూరు రూరల్: ఇంటర్మీడియెట్ చదువుతూ మధ్యలో మానేసిన విద్యార్థులు ఓపెన్ ఇంటర్ చదివేందుకు ఈ నెల 27వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని స్థానిక జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శంకర్‌ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి నెలలో 15 రోజులు ప్రత్యేక తరగతులు నిర్వహించి పరీక్షలకు సన్నద్ధం చేస్తామన్నారు. ఏప్రిల్ 18 నుంచి 23వ తేదీ వరకు పరీక్షలు రాయాల్సి ఉంటుందన్నారు.

హోరాహోరీగా క్రికెట్ పోటీలు

కృష్ణగిరి: మండల కేంద్రంలో దస్తగిరయ్య స్వామి ఉరుసు ఉత్సవాలను పురస్కరించుకుని నిర్వహిస్తున్న జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు హోరా హోరీ గా జరుగుతున్నాయి. 20 జట్లు పాల్గొనగా శనివారం జరిగిన పోటీల్లో రామాపురం జూనియర్ జట్టుపై కర్నూలు, కృష్ణగిరి జూనియర్ జట్టుపై రామాపురం సీనియర్‌జట్లు గెలిపొందినట్లు ని ర్వాహకులు దూద్‌బాషా,పీరా, బాషా తెలిపారు.

నేడు కబడ్డీ పోటీలు

ఉరుసు సందర్భంగా ఆదివారం జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన జట్లకు దాతల సహకారంతో వరుసగా రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలను అందివనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి

కృష్ణగిరి: ఉపాధి పనులకు కూలీల సంఖ్యను పెంచాలని ఎంపీడీఓ మోహన్‌కుమార్ సిబ్బందికి సూచించారు. స్థానిక ఉపాధి కార్యాలయంలో శనివారం ఆయన సిబ్బందితో సమావేశం నిర్వహించారు. జాబ్ కార్డులో ఉండే ప్రతిఒక్కరికీ ఆధార్ అనుసంధానం వందశాతం పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో వ్యవసాయ పనులు ముగుస్తుండటంతో కూలీలకు పనులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

దిగుబడుల కొనుగోళ్లు ప్రారంభం

ఆలూరురూరల్: మండల పరిధిలోని పెద్దహోతూరు ఆర్బీకే కేంద్రం, హాలహర్వి మండల కేంద్రంలోని ఆర్బీకేలో శుక్రవారం ఏడీఏ సునీత ఆధ్వర్యంలో మార్క్‌ఫెడ్ డీఎం రాజు, కేడీసీఎంఎస్ డీఎం రాజేష్ శనగ కొనుగోళ్లు ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర క్వింటం రూ.5,335తో కొనుగోలు చేస్తామని ఏడీఏ తెలిపారు. ఒక్కో రైతు నుంచి వంద క్వింటాళ్ల వరకు కొనుగోలు చేస్తామన్నారు. క్వింటం రూ.5,335 మద్దతు ధరలో దిగుబడులను కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ జిల్లా మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ తేజ, ఆలూరు కేడీసీఎంఎస్ ఇన్‌చార్జ్ ప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు.

జొన్నల కొనుగోళ్లు..

చిప్పగిరి:మద్దతు ధరతో జొన్నల కొనుగోళ్లను పౌరసరఫరాల శాఖ డీఎం శర్మిల ఆధ్వర్యంలో శనివారం ప్రారంభించారు. మండలంలోని రామదుర్గం, నగరడోణ తదితర గ్రామాల్లో రైతుల నుంచి 230 క్వింటాళ్ల జొన్నలను రూ.2,970తో కొనగోలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దారు లక్ష్మీనారాయణ, ఏఓ ఆనంద్, వీఆర్‌ఓ మల్లికార్జున పాల్గొన్నారు.



పెద్దహోతూరులో పప్పుశనగ కొనుగోళ్లు ప్రారంభిస్తున్న అధికారులు

క్రైం కార్నర్

గడ్డి వాముల దగ్ధం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

తుగ్గలి: నిప్పు రవ్వలు పడి జొన్నగిరిలో మూడు గడ్డి వాములు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన కొట్టం రాముడు పశువుల కోసం వేరుశనగ గ్రాసం, వరి గడ్డి కొనుగోలు చేసి బస్టాండ్ సమీపంలో ఉన్న వామిదొడ్డిలో నిల్వ చేశాడు. శనివారం సమీపంలో వెల్డింగ్ పని చేస్తుండగా నిప్పు రవ్వలు ఎగిరి గడ్డివామిపై పడి పెద్ద ఎత్తున మంటలు వ్యాపించాయి. పక్కనున్న మరో రెండు చిన్న గడ్డి వాములు కూడా కాలి బూడిదయ్యాయి. పత్తికొండ అగ్నిమాపక అధికారి దినకర్ బాబు, సిబ్బంది రామకృష్ణ, సూర్యప్రకాష్, చంద్రమోహన్ ఫైరింజన్‌తో అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు. దాదాపు రూ.3 లక్షల దాకా నష్టం వాటిల్లినట్లు బాధిత రైతులు రాముడు, హనుమప్ప, పెద్దయ్య తెలిపారు.

మెకానిక్ షెడ్డులో అగ్నిప్రమాదం

మద్దికెర: స్థానిక మద్దమ్మ చెరువు రోడ్డులో ఉన్న మెకానిక్ నబీకి చెందిన షెడ్డులో శనివారం తెల్లవారుజామున అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. స్థానికులు గుర్తించి మంటలను అదుపు చేశారు. పక్కనే వామిదొడ్లు ఉండడంతో రైతులు భయాందోళనలకు గురయ్యారు. ప్రమాదం ఎలా జరిగిందేనది తెలియాల్సి ఉంది. కాగా తనకు రూ.80 వేలు నష్ట వాటిల్లిందని బాధితుడు తెలిపారు.



కాలిన బంకు చూపుతున్న బాధితుడు నబీ

తీరనున్న పల్లె దాహం

- జల జీవన్ మిషన్‌తో ప్రతి ఇంటికీ కుళాయి
- నియోజకవర్గంలో 112 గ్రామాలు ఎంపిక
- రూ.31.22 కోట్లతో పథకం అమలు
- ఈ ఏడాది మరో 115 గ్రామాలు ఎంపిక.. రూ.56.09 కోట్లు మంజూరు

పత్తికొండ టౌన్: మారుమూల గ్రామాల్లో ప్రజలు తాగునీటి కోసం తంటాలు పడేవాళ్లు. బిందెలు చేతపట్టి కిలోమీటర్ల దూరం ఉన్న వ్యవసాయ బోరుబావుల వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకునేవారు. మరికొన్ని చోట్ల పేదలు, కూలీలు తమ పనులు మానుకుని నీటి కోసం వేచి చూసేవారు. ఇలాంటి సమస్యకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెక్ పడుతున్నాయి. 'జలజీవన్ మిషన్' ద్వారా ఇంటింటికి కుళాయి ఏర్పాటు చేస్తూ తాగు నీటి కష్టాలను తీర్చనున్నాయి. ఆ దిశగా అధికారులు చర్యలను ముమ్మరం చేశారు. 2024 మార్చి నాటికి గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి ఇంటికి కుళాయి ఏర్పాటు చేసి వ్యక్తికి రోజుకు 55 లీటర్ల చొప్పున తాగు నీటిని ఇవ్వాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శ్రమిస్తున్నాయి. జల జీవన్ మిషన్ కింద ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి చొరవతో నియోజకవర్గంలో 112 గ్రామాలను ఎంపిక చేశారు. ఆ గ్రామాలలో ఫస్ట్, సెకెండ్ ఫేస్ కింద బోర్లు వేసి, ట్యాంకులు నిర్మించి, పైపులైన్ల ద్వారా ప్రతి ఇంటికి కుళాయి ఏర్పాటు చేసి తాగునీటి ఇబ్బందులు లేకుండా చేసేందుకు ప్రభుత్వం రూ.31.22 కోట్లు కేటాయించింది.

- గ్రామీణ నీటిసరఫరా(ఆర్‌డబ్ల్యూఎస్) అధికారుల పర్యవేక్షణలో జలజీవన్ మిషన్ పథకం పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. దాదాపుగా 25 గ్రామాలలో పనులు పూర్తికాగా, 50కి పైగా గ్రామాల్లో పనులు కొనసాగుతున్నాయి. మిగిలిన గ్రామాల్లో పనులు ప్రారంభించాల్సి ఉంది. మొత్తం నిధులు ఖర్చుచేసి పనులు పూర్తిచేస్తే పత్తికొండ నియోజకవర్గంలో తాగునీటి ఇబ్బందులకు ఇక శాశ్వతంగా చెక్ పడే అవకాశం ఉంది.
- మొదటి, రెండవ విడతలో 112 గ్రామాలు, రూ.31.22 కోట్లు మంజూరు కాగా, మూడవ విడతలో ఈ ఏడాది కొత్తగా మరో 115 గ్రామాలు, రూ.56.09 కోట్లు మంజూరయ్యాయి. ఈ పనులు టెండర్లు పూర్తి కావాల్సి ఉంది. మొత్తం నియోజకవర్గంలో 227 గ్రామాలకు గాను జలజీవన్ మిషన్ పథకం కింద రూ.87.31 కోట్లు మంజూరయ్యాయి. 2024 మార్చి నాటికి పనులు పూర్తయితే నియోజకవర్గంలోని గ్రామాల నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించినట్లవుతుంది.





మానసింగ్‌తండాలో వేసిన పైపులైను, వెల్దుర్తి మండలం తిమ్మాపురంలో నిర్మించిన ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకు

మండలాల వారీగా వివరాలు..

మండలం	ఎంపికైన గ్రామాలు	నిధులు (రూ.కోట్లు)
పత్తికొండ	25	రూ.11.12
వెల్దుర్తి	51	రూ.12.49
కృష్ణగిరి	26	రూ.5.54
మద్దికెర	10	రూ.2.07
మొత్తం	112	రూ.31.22

ఈ ఏడాది మంజూరైన నిధులు

మండలం	ఈ ఏడాది ఎంపికైనగ్రామాలు	నిధులు (రూ.కోట్లలో)
పత్తికొండ	30	రూ.18.87
తుగ్గలి	50	రూ. 17.19
వెల్దుర్తి	11	రూ.6.66
కృష్ణగిరి	13	రూ.6.48
మద్దికెర	11	రూ.6.89
మొత్తం	115	రూ. 56.09కోట్లు

పథకం లక్ష్యం

- గ్రామంలోని అన్ని కుటుంబాలకు కుళాయి కనెక్షన్ ఇవ్వడం
- ప్రతి వ్యక్తికి రోజుకు 55 లీటర్ల స్వచ్ఛమైన నీటిని అందించడం
- స్థానిక తాగునీటి వనరుల లభ్యత ఆధారంగా సమస్యను అధిగమించడం
- ప్రస్తుతం ఉన్న తాగునీటి వ్యవస్థ నుంచి మరింత మెరుగైన సేవలు అందించడం
- అవసరమైన చోట అదనపు బోర్లు వేసి, తాగునీటి ట్యాంకులు ఏర్పాటుచేసి, అదనపు పైపులైన్లు వేయడం



కృష్ణగిరిలో పనులను పరిశీలిస్తున్న ఏఈఈ హరినాథ్

పనులు జరుగుతున్నాయి



నియోజకవర్గంలో మొదటి రెండు విడతల్లో 112 గ్రామాలు ఎంపికయ్యాయి. ఇప్పటికే 25 గ్రామాల్లో పనులు పూర్తయ్యాయి. మిగిలిన చోట్ల పనులు జరుగుతున్నాయి. ఈ ఏడాది క్రొత్తగా మరో 115 గ్రామాలు ఎంపికయ్యాయి. జలజీవన్ మిషన్ పథకం ద్వారా రక్షిత మంచినీటి పథకాలు మెరుగుపడ్డాయి. వేసవికాలంలో తాగునీటి సరఫరా కష్టంగా ఉండేది. అన్ని పనులు పూర్తి అయితే గ్రామాల్లో తాగునీటి కష్టాలు ఇక ఉండబోవు.

– మగ్బుల్‌ఖాన్, డీఈఈ, ఆర్‌డబ్ల్యూఎస్